3 పంటలకు భరోసా ఇస్తరా?

యథాతథంగా అమలు చేస్తే చర్చ ఎందుకు? • రైతుబంధు దుర్వినియోగమనేది అబద్ధం • 11 సీజన్లలో 73 వేల కోట్లు ఇచ్చినం: కేటీఆర్

- రైతు ఆత్మహత్యలపై రేవంత్ సర్కార్ తప్పుడు లెక్కలు
- రైతు భరోసా కింద ఒక్కో రైతుకు రేవంత్ సర్కార్ ఎకరానికి 17,500 బాకీ పడింది
- స్థానిక ఎన్నికల్లో రైతులను బురిడీ కొట్టించేందుకే సంక్రాంతి తర్వాత రైతుభరోసా అంటున్నరు
- కాంగ్రెస్ సర్కార్ తీరుపై కేటీఆర్ ఫైర్

శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్.
చిత్రంలో ఎంపీ రవిచంద్ర, ఎమ్మెల్యేలు వివేకానంద, విజయుడు, అనిల్‌జాదవ్, మాణిక్‌రావు, సంజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా రుణ మాఫీ, రైతుభరోసాతోపాటు అన్నదాతల ఆత్మ హత్యలపైనా తప్పుడు లెక్కలు చెప్పారని బీఆ ర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధును ఉన్నది ఉన్నట్టుగా ఇచ్చే ఉద్దేశం కాంగ్రెస్ సర్కా ర్‌కు ఉంటే, కోతలు పెట్టే ఉద్దేశమే లేకుంటే అసెంబ్లీలో చర్చ ఎందుకు? అని ప్రశ్నించారు. రైతు భరోసాపై అసెంబ్లీలో శనివారం చేపట్టిన స్వల్పకాలిక చర్చ, అనంతరం మీడియా పాయింట్‌లో కేటీఆర్ మాట్లాడారు. రైతుబం ధుపై రైతుల్లో ఆందోళన ఉన్నదని, మూడు పంటలకు ఇస్తారో? ఇవ్వరో? స్పష్టంచేయా లని, ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలున్న గిరిజన రైతు లకు ఎన్ని పంటలకు రైతుబంధు ఇస్తారని నిల దీశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు మూడు పంటలకు రైతుబంధు ఇవ్వాల్సిందే నని డిమాండ్ చేశారు. 'భూ భారతిలో అను భవదారు..కౌలుదారు కాలం పెట్టారు. మొదటి వంద రోజుల్లోనే కౌలు రైతులకు రైతు భరోసా అమలు చేస్తామని చెప్పారు. ఇప్పు డేమో రైతుభరోసాపై మంత్రి తుమ్మల నిర్ణయం తీసుకోలేదంటున్నరు. కౌలు రైతులు కండ్లల్లో వత్తులేసుకుని ఎదురుచూస్తున్నరు. నాడు రేవంత్‌రెడ్డి చెప్పినట్టు కౌలు రైతులకు రైతుభరోసా ఇవ్వాలి.. కౌలు రైతులకు ఎన్నిక లకు ముందు రేవంత్‌రెడ్డి లేఖ రాశారు. భూ యాజమానితో సమానంగా 22 లక్షల కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వాల్సిందే' అని కేటీ ఆర్ తెగేసిచెప్పారు.

> పోయిన యాసంగి 2500, నిన్న వానకాలం 7500, ఇప్పుడు యాసంగి 7500 ఇలా మొత్తం ఒక్కో రైతుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరానికి రూ.17,500 బాకీ పడ్డది. రెండు విడతల రైతు భరోసా, ఒక విడత 5 వేలే ఇచ్చి ఎగ్గొట్టిన 2500 కలిపితే రూ.17,500 మేర సుమారు రూ.26,775 కోట్లు రైతన్నలకు సర్కారు బాకీ ఉన్నది. ఈ మొత్తాన్ని రైతులకు ఇచ్చేదాకా వదిలిపెట్టం.
> -కేటీఆర్

అవే 5 వేలిచ్చారు

'ఎన్నికల ముందు ముష్టి పదివేలు ఎందుకు? ఎకరానికి 15 వేల రైతుభరోసా ఇస్తం అన్నరు. ఇప్పుడు తీసుకుంటే 5 వేలు, డిసెంబర్ 3 తర్వాత తీసుకుంటే 7500 అని చెప్పిండ్రు. ఇప్పటిదాకా రైతుభరోసా వేయ లేదు. ఇదే కాంగ్రెస్ నేతలు రైతుబంధు అపా లని ఎన్నికల సంఘానికి లేఖలు రాసిండ్రు. ఎన్నికల కోడ్‌తో మేం ఇవ్వలేకపోయినం. అవే డబ్బులను ఒక్కసారి రైతులకిచ్చి, రెండుసార్లు ఎగవేసిండ్రు. మార్పు మార్పు అని రైతు బంధు పేరుమార్చి అవే 5 వేలు ఇచ్చిండ్రు' అని కేటీఆర్ దుయ్యబట్టారు.

పాన్ కార్డు ఉన్న రైతులకు ఎగవేస్తరా?

అందరికీ అన్నీ చేస్తామని హామీలిచ్చి ఇప్పుడు కొందరికి కొన్నే అని చెప్తున్నారని సర్కార్ తీరుపై కేటీఆర్ మండిపడ్డారు. 'రైతు బంధు పథకం ఉసురుతీయబోతున్నరు. ఊరి వేయబోతున్నరు. ఈ రోజుల్లో రుణ వ్యవస్థ అర్హతల ప్రకారం గ్రామాల్లోనూ ఐటీ చెల్లిం పులు, పాన్ కార్డులు కలిగిన వ్యక్తులు, రైతన్న లున్నరు. వారందరికీ రైతుబంధు ఎగబెడు తారా?' అంటూ నిలదీశారు.

'ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వబోమని చెప్తు న్నరు. రైతు బిడ్డ ప్రభుత్వ ఉద్యోగి అయితే తర తరాలుగా వాళ్లకు భూమితో ఉన్న బంధాన్ని తెపేస్తరా?' అని ప్రశ్నించారు. మంత్రి వర్గ ఉప సంఘం నివేదికను వెంటనే రాష్ట్రం ముందు పెట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఖజానా మొత్తం అంతా కర్షకుడే మింగేసినట్టు ప్రాపగండా చేస్తున్నారని, గుట్టలకు, పుట్టలకు రైతుబంధు అని చెప్పి అనేక కట్టు కథనాలు రాయించారని విమర్శించారు.

స్థానిక ఎన్నికల్లో బురిడీ కోసమే..

స్థానిక ఎన్నికల్లో రైతులను బురిడీ కొట్టిం చేందుకే సంక్రాంతి తర్వాత రైతుభరోసా ఇస్తా నని ముఖ్యమంత్రి నమ్మబలుకుతున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఇప్పటికే వానకాలం పంటకు ఎగ్గొట్టిన ఆయన ఇప్పుడు ఓట్ల కోసం కొత్త నాటకానికి తెరలేపారని దుయ్యబట్టారు. ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను గల్లా పట్టి అడగాలని రైతులకు పిలుపునిచ్చారు. అసెంబ్లీలో దేనిగురించి అడిగినా రేవంత్‌రెడ్డి ఉక్రోశం వెళ్లగక్కుతున్నారని ఆక్షేపించారు.

రైతుబంధుపై కాంగ్రెస్ దుష్ప్రచారం

రైతుబంధుపై కాంగ్రెస్ భారీగా దుష్ప్ర చారం చేసిందని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో నూటికి 98 శాతం చిన్న రైతులే ఉండగా, చిన్నాపెద్దా తేడాలేకుండా వ్యవ సాయ రంగం గాడిన పడేదాకా అందరికీ రైతు బంధు ఇవ్వాలని నిర్ణయించామని చెప్పారు. వ్యవసాయ రంగం స్థిరీకరణ జరిగేదాకా రైతు బంధుపై ఎలాంటి ఆంక్షలు పెట్టలేదని గుర్తుచే శారు. 'మట్టిని నమ్ముకొని బతికే రైతుకు ఎంత చేసినా.. ఏమిచ్చినా తక్కువే అన్నది మా విధానం. రైతుబంధు లబ్ధిదారుల్లో 91.33 శాతం 5 ఎకరాల కంటే తక్కువ భూములున్న ఉన్నవారే ఉన్నరు. 5-10 ఎకరాల్లోపున్న మధ్య తరగతి రైతులు కేవలం7.28 శాతమే. 10 ఎకరాలు పైబడిన వాళ్లు 1.39 శాతమే. 25 ఎకరాల పైనున్న పెద్ద రైతులు కేవలం 0.09 శాతం మాత్రమే. 72 వేల కోట్ల రైతు బంధులో పెద్ద రైతులకు పోయింది కేవలం 1.39 శాతమే' అని కేటీఆర్ వివరించారు. రైతుబంధు పథకంలో రూ.21,283 కోట్లు దుర్వినియోగమైనట్టు బద్నాం చేశారని, ఇది సరికాదని హితవుపలికారు. 11 సీజన్లకు గాను రైతుల ఖాతాల్లో రూ.73 వేల కోట్లు జమ య్యాయని చెప్పారు.

కల్లాల నిండా ధాన్యం.. కండ్ల నిండా ధైర్యం

'2014 -15లో ఆర్బీఐ లెక్కల ప్రకారం తెలంగాణలో సాగు విస్తీర్ణం 34.35 లక్షల ఎక రాలు. 106.86 లక్షల టన్నుల పంట ఉత్పత్తి వచ్చేది. మేము దిగిపోయేనాటికి సాగు విస్తీ ర్ణాన్ని 34 లక్షల నుంచి 59.8 లక్షలకు చేర్చినం. ఆహార పంటల ఉత్పత్తి 71 లక్షల టన్నుల నుంచి 2 కోట్ల టన్నులకు పెంచినం. 185 శాతం వృద్ధి. రెండు పంటలు కలిపి 1.30 కోట్ల టన్నుల నుంచి 2.2 కోట్ల టన్ను లకు పెరిగింది. రైతుబంధు వల్లే ఇది సాధ్య మైంది. కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి, భక్తరామదాసు, సీతారామ ఎత్తిపోతల పథకా లతో మా పదేండ్ల పాలనలో పాడిపంటల తెలంగాణగా, సుభిక్ష తెలంగాణ మార్చినం. సాగునీటి పారకం 2014లో 62 లక్షల 50 వేల ఎకరాలు ఉంటే 2023 నాటికి కోటీ 60 లక్షల ఎకరాలకు చేరింది. 155 శాతం పెరుగు దలతో తెలంగాణలో అదనంగా సూమారు కోటి ఎకరాలను సాగులోకి తెచ్చినం. సాగు చేయని రైతులకు ప్రోత్సాహకాలు ఇవ్వడం వల్లే సాగు భారీగా పెరిగింది. వరిలో ఎక్కడో పది, పదకొండో స్థానం నుంచి ప్రథమస్థానా నికి ఎగబాకినం. 2013-14 బియ్యం ఉత్పత్తి 57 లక్షల టన్నులు ఉంటే 2023-24 నాటికి కోటీ 68 లక్షల టన్నులకు పెరిగింది. ఉమ్మడి రాష్ట్రంలో ఏపీ తెలంగాణ కలిపి కూడా ఎఫ్‌సీ ఐకి ఇచ్చిన ధాన్యం 90 లక్షల టన్నులు దాట లేదు. కానీ 2021లో ఒక్క తెలంగాణ నుంచే కోటీ 41 లక్షల టన్నుల వడ్లను ఎఫ్‌సీఐకి ఇచ్చినం. తెలంగాణ రైతులు పండించిన ధాన్యం కొనలేక ఎఫ్‌సీఐ చేతులెత్తేసింది. పదేం డ్లలో రైతన్నల నుంచి మా ప్రభుత్వం కొను గోలు చేసిన ధాన్యం విలువ అక్షరాల లక్షా 34 వేల కోట్లు. 2014-15లో కోనుగోలు చేసింది 24 లక్షల టన్నులుంటే.. 2022-23లో కోటీ 30 లక్షల టన్నులకు చేరింది. కల్లాల నిండా ధాన్యం, రైతుల కండ్ల నిండా ధైర్యం వచ్చింది' అని బీఆర్ఎస్ పాలనలో వ్యవసాయ రంగ విజయాలను కేటీఆర్ ప్రస్తావించారు.

> సాగు భూములకే రైతుబంధు ఇస్తామని చెప్పడం వల్ల అనేక మంది రైతులు ఆందోళన చెందుతున్నరు. ఆర్వోఎఫ్ఆర్ పట్టాల కింద ఉన్న భూముల్లో ఒక్క పంట సాగుకే అవకాశం ఉంటుంది. గిరిజన బిడ్డలకు రెండో విడత రైతుబంధు ఇస్తారా? లేదా? పత్తి పంట కాలం 8 నెలలు. మరి పత్తిరైతుకు ఒకటే పంటకు ఇస్తారా? రెండు పంటలకు ఇస్తరా? కంది పంట కాలం కూడా 8 నెలలు. ఒక్కసారే ఇస్తరా? రెండు సార్లు ఇస్తరా?
> -కేటీఆర్

రైతు బతుక్కు భూమికి భరోసా లేదు

'ప్రతి పంటకు మద్దతు ధరకు అదనంగా 500 బోనస్ ఇస్తామని మ్యానిఫెస్టోలో చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం బోనస్ ఇవ్వాలి' అని కేటీఆర్ డిమాండ్ చేశారు. 700 కోట్ల బోనస్ ఇచ్చి 7,600 కోట్ల రైతు భరోసా ఎగ్గొట్టారని విమర్శించారు. 'అధికా రంలోకి రాగానే తొలి క్యాబినెట్ మీటింగ్‌లోనే ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామ న్నరు. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ ఏమైంది? 12 నెలలైనా తొలి క్యాబినెట్ జర గలేదా? లేక రాహుల్ అనుమతి రాలేదా?' అని కేటీఆర్ నిలదీశారు. కాంగ్రెస్ పాలనలో రైతు బతుకుకు భరోసా లేదని, రైతు భూమికి భరోసా అంతకన్నాలేదని పొలంలో ఉండా ల్సిన రైతు జైలులో ఉండే పరిస్థితి నెలకొన్న దని లగచర్ల రైతులను ఉదహరిస్తూ ఆవేదన వ్యక్తంచేశారు.

> తెలంగాణలో 70 లక్షల మంది రైతులకు.. ఎకరాకు రూ.15 వేల చొప్పున 1.53 కోట్ల ఎకరాలకు గాను రూ.23 వేల కోట్లు కావాలి. కానీ, రైతు భరోసా కోసం కాంగ్రెస్ సర్కార్ బడ్జెట్లో కేవలం రూ.15 వేల కోట్లే కేటాయించింది. ఇదే మీ చిత్తశుద్ధికి నిదర్శనం. రైతుభరోసాలో కోతలకు సిద్ధ పడిన తర్వాతనే ప్రభుత్వం ఉప సంఘాన్ని ఏర్పాటు చేసిందనేది సుస్పష్టం.
> -కేటీఆర్

రైతు ఆత్మహత్యలు తగ్గించినం

'2014కు ముందు వ్యవసాయం సంక్షోభంలో ఉన్నది. ఎన్‌సీఆర్‌బీ లెక్కల ప్రకారం దేశంలో తెలంగాణ, విదర్భలో రైతు ఆత్మహత్యలు ఎక్కువ. రైతు ఆత్మహత్యల్లో మన వాటా 11.1శాతం. అదే 2023కు వచ్చేసరికి 1.05 శాతానికి తగ్గించినం. 2014లో 898 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటే 2020లో 466కు తగ్గించినం. ఇదే అత్యల్పమని కేంద్రం కూడా చెప్పింది. వలసలు వాపస్ అయినయి. ఉత్తర్‌ప్రదేశ్, బీహార్ నుంచి కూలీలు మన దగ్గరికి వలసవస్తున్నరు. బొడ్రాయి పండుగకు ఒక్కో ఊర్లో లక్షలు ఖర్చుపెడుతున్నరు. సాగు బాగయ్యింది. వ్యవసాయం బాగయ్యింది కాబట్టే ఈ పరిస్థితి వచ్చింది' అని కేటీఆర్ వివరించారు. 'ఇంత పంట ఎట్ల పండించిండ్రు.. ఏం చమత్కారం చేసిండ్రని కేంద్ర మంత్రి మమ్మల్ని అడిగిండు. చమత్కారం కాదు బృహత్కార్యం చేసినం కాబట్టే రైతు ఆత్మహత్యలు తగ్గినయి. పంటల సాగు పెరిగింది' అని కేటీఆర్ స్పష్టంచేశారు.

రైతుబంధుకు దేశవ్యాప్తంగా ప్రశంసలు

బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు పథకం దేశవ్యాప్తంగా అనేక ప్రశంస లు అందుకున్నదని కేటీఆర్ గుర్తుచేశారు. ఒడిశాలో కాలియా పథకం, బెంగాల్ కృషి బంధు పథకం సహా అనేక రాష్ట్రాలు రైతుబంధును ఆదర్శంగా తీసుకొని నగదు బదిలీ పథకాలు ప్రవేశపెట్టాయని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ కూడా రైతుబంధును కాపీ కొట్టి పీఎం కిసాన్ సమ్మాన్ పథకాన్ని ప్రారంభించిందని, ఈ పథకంలో కేంద్రం అనేక కోతలు పెట్టిందని చెప్పారు. రైతుబంధు పథకం అశోక్ గులాటీ, అరవింద్ సుబ్ర హ్మణ్యం, రఘురాం రాజన్, అభిజిత్ బెనర్జీ వంటి ఆర్థికవేత్తలు, ఐక్యరాజ్య సమితి ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఏవో) దాకా అందరి ప్రశంసలు అందుకు న్నదని, రైతు రందిని మార్చిన గేమ్ చేంజర్ రైతుబంధు అని స్పష్టంచేశారు.

వీటికి ఇస్తరా? ఇవ్వరా?

సాగు భూములకే రైతుబంధు ఇస్తామని చెప్పడం వల్ల అనేక మంది రైతులు రైతుభ రోసా కోల్పోతారని కేటీఆర్ చెప్పారు. ఆర్వో ఎఫ్ఆర్ పట్టాల కింద ఉన్న భూముల్లో ఒక్క పంట సాగుకే అవకాశం ఉంటుందని, గిరిజ నులకు రెండో విడత రైతుబంధు ఇస్తరా? లేదా? చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో పత్తి 45 లక్షల ఎకరాల్లో పండుతున్నదని, పంట కాలం 8 నెలలని, కంది పంట కాలం కూడా 8 నెలలు కాబట్టి పత్తి, కంది రైతులకు ఒక్క సారే ఇస్తరా? రెండు సార్లు ఇస్తరా? చెప్పాలని డిమాండ్ చేశారు. రైతుబంధుకు కోతలు పెట్టే ఆలోచన లేకుంటే పీఎం కిసాన్ గురించి మంత్రి తుమ్మల ఎందుకు ప్రస్తావించారని ప్రశ్నించారు. 'పీఎం కిసాన్ మార్గదర్శకాలే మీకు మార్గదర్శకమైతే 25 శాతం మంది రైతులకే రైతు భరోసా వస్తుంది. పీఎం కిసాన్ మార్గదర్శకాలు పాటించబోమని మంత్రి తుమ్మల చెప్తున్నారు. ఉన్నది ఉన్నట్టు ఇచ్చే దుంటే చర్చ ఎందుకు? రంగారెడ్డి, వికారా బాద్ జిల్లాల్లో మూడు పంటలు సాగు చేసేవా రున్నారు. మరి మూడు పంటలకు రైతు భరోసా ఇస్తరా? ఇదే శాసనసభలో ప్రతిప క్షంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ మూడో పంటకు ఎందుకు ఇవ్వరని మమ్మల్ని ప్రశ్నించారు. మీరు మూడో పంటకు రైతు బంధు ఇస్తరా? ఇవ్వరా? అనేదానిపై స్పష్టత ఇవ్వాలి' అంటూ నిలదీశారు.

..రాజీనామా చేస్తా

మొదటిపేజీ తరువాయి...

వందశాతం రుణమాఫీ కాలేదు' అని సర్కార్‌ను కడిగిపారేశారు. శనివారం రైతు భరోసాపై అసెంబ్లీలో స్వల్ప కాలిక చర్చ సంద ర్భంగా మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కేటీఆర్ మధ్య మాటల యుద్ధం జరిగింది. పరస్పరం రాజీనామా సవాళ్లతో అసెంబ్లీ హీటెక్కింది. ముందు కేటీ ఆర్ మాట్లాడుతుండగా కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కల్పించుకున్నారు. దీంతో ఆయనకు కేటీ ఆర్ ఘాటుగా బదులిచ్చారు.

శాసనసభాపక్షం మొత్తం రాజీనామా

24 గంటల కరెంట్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వాదనను కేటీఆర్ తిప్పికొ ట్టారు.'ఈ రోజు ఏ పత్రికచూసినా కాంగ్రెస్ ప్రకటనలే కనబడుతున్నయి. దాంట్లో 24 గంటల కరెంట్ ఇస్తున్నట్టు ప్రకటనలిచ్చుకుం టున్నరు. 24 గంటల విద్యుత్తు ఇస్తున్నార న్నది అవాస్తవం. కావాలంటే సభ వాయిదా వేసి అందరం నల్లగొండకు పోదాం. ఈ రోజు ఒక్క లాగ్ బుక్కులో అయినా 24 గంటల కరెంట్ ఇస్తున్నట్టు చూపిస్తే బీఆర్ఎస్ శాసన సభా పక్షం మొత్తం రాజీనామా చేస్తం' అని కోమటిరెడ్డికి కేటీఆర్ సవాల్ చేశారు. 'గ తంలో 24 గంటల విద్యుత్తు ఇవ్వలేదని కోమ టిరెడ్డి సభను తప్పుదోవ పట్టించడం సరి కాదు. బీఆర్ఎస్ పాలనలో 24 గంటల్లో సగ టున 19.2 గంటల విద్యుత్తు ఇచ్చినట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కనే చెప్పారు. ఈ విషయాన్ని ఆయననే అడగండి' అంటూ కాంగ్రెస్ సభ్యులకు సూచించారు. 'కావా లంటే సభను వాయిదా వేసి నల్లగొండ జిల్లాకు వెళ్లి విద్యుత్తు పరిస్థితులను ఇప్పుడు పరిశీలిద్దాం. మంత్రి కోమటిరెడ్డి కోరినట్టు ఎలక్ట్రిసిటీ, మిషన్ భగీరథపై చర్చ పెట్టండి. చర్చించేందుకు సిద్ధంగా ఉన్నం. నల్లగొండ జిల్లా అభివృద్ధిపై కూడా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం' అని కేటీఆర్ స్పష్టంచేశారు. మరో పది రోజులు సమావేశాలను పొడగించా లని స్పీకర్‌ను కోరారు.

నోటికి ఎంతొస్తే అంతేనా?

అప్పుల విషయంలో మంత్రులు తలో విధంగా మాట్లాడుతున్నారని కేటీఆర్ మండి పడ్డారు. 'ఆర్‌బీఐ లెక్కల ప్రకారం ఏడాదికి కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పు 40 వేల కోట్ల యితే మీ ప్రభుత్వం ఏడాదిలో చేసిన అప్పు 1.27 లక్షల కోట్లు. ఇది ఆర్‌బీఐ లెక్క. ఇక్కడ రేవంత్‌రెడ్డి లెక్కనో.. జూపల్లి లెక్కనో చెల్లదు' అంటూ బదులిచ్చారు. 'మంత్రులు పూర్తిగా తెలుసుకొని రావాలి. ఒకాయన 7, మరోకా యన 8. ఇంకోఆయన 10 లక్షల కోట్ల అప్పు అంటున్నరు. నోటికి ఎంతొస్తే అంతేనా?' అంటూ మండిపడ్డారు. ఏది పడితే అది మాట్లాడితే ఎట్లా? అని తిప్పికొట్టారు.

వారికి సరిగ్గా ట్రెయినింగ్ ఇవ్వలేదా?

'కాంగ్రెస్ మంత్రులు కూడా సీఎం రేవం త్‌ను అనుసరిస్తున్నరు.. ఒకరేమో రుణమాఫీ మొత్తం అయ్యిందంటరు. మరొకరు కొంచెమే మిగిలి ఉన్నదంటరు. ఇంకొకాయన 70 శాతం చేసినమని చెప్తున్నరు. వారి మాటలు చూస్తుంటే రేవంత్‌రెడ్డి వారికి ట్రైనింగ్ సరిగ్గా ఇవ్వలేదని అర్థమవుతున్నది' అంటూ కేటీఆర్ ఎద్దేవాచేశారు. ఇప్పటికైనా తప్పుడు మాటలు కట్టిపెట్టి వాస్తవాలు చెప్పాలని హితవు పలి కారు. నిజాయితీగా మాట్లాడాలన్న జూపల్లి వ్యాఖ్యలపై స్పందిస్తూ 'కేసీఆర్‌పై మీరు ఎంత గొప్పగా మాట్లాడారో వీడియోలు ప్లే చెయ్యి మంటరా?' అంటూ కేటీఆర్ బదులిచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే బ్యాంకర్ల మీటింగ్‌లో రూ.49,500 కోట్ల మేర రైతు రుణమాఫీ అని చెప్పారని, ఆ తర్వాత రూ.40 వేల కోట్లు అని చెప్పారని, బడ్జెట్ సమావేశాల్లో రూ.26 వేలు కోట్లు అని పెట్టా రని, ఇప్పుడు రూ.20 వేల కోట్లు మాత్రమే చేశామని చెప్పారని, వాస్తవానికి చెప్పిన దాంట్లో 25 శాతం కూడా చేయలేదని ధ్వజ మెత్తారు. 'ఇదే విషయంపై అసెంబ్లీలో నిల దీస్తే శాపనార్థాలు పెడుతున్నారు. ఆయన పెట్టే పిల్లి శాపనార్థాలకు ఉట్లు తెగిపడవు' అంటూ దెప్పిపొడిచారు. రుణమాఫీపై అవసరమైతే సీఎం రేవంత్‌రెడ్డి సొంతూరు కొండారెడ్డిప ల్లిలో చర్చిందేందుకు సిద్ధమని సవాల్ విసి రారు. రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెప్పడంలో దిట్ట అని, చారాణా రుణమాఫీ చేసి మొత్తం అయి నట్టు పోజులు కొడుతూ రూ.550 కోట్లతో పత్రికల్లో ప్రకటనలు ఇవ్వడమే ఇందుకు నిద ర్శనమని మండిపడ్డారు.

> అధికారంలోకి వచ్చిన వెంటనే బ్యాంకర్ల మీటింగ్‌లో రూ.49,500 కోట్ల మేర రైతు రుణమాఫీ అని చెప్పిండ్రు. ఆ తర్వాత రూ.40 వేల కోట్లు అన్నరు. బడ్జెట్ సమావేశాల్లో రూ.26 వేలు కోట్లు అన్నరు. ఇప్పుడు రూ.20 వేల కోట్లే చేశామని చెప్తున్నరు. మీరు చెప్పినదాంట్లో 25 శాతం కూడా రుణమాఫీ చెయ్యలేదు. ఇదే విషయంపై అసెంబ్లీలో నిలదీస్తే శాపనార్థాలు పెడుతున్నరు.
> -కేటీఆర్

గద్దర్, గోరటి పాటలు.. శ్రీశ్రీ కవితలు..

అసెంబ్లీలో చర్చ సందర్భంగా గద్దర్, గోరటి వెంకన్న పాటలు, శ్రీశ్రీ కవితలను కేటీ ఆర్ చదివి వినిపించారు. గోరటి వెంకన్న రాసిన 'సేతామేడుందిరా.. తెలంగాణ చేలన్నీ బీళ్లాయెరా', 'పల్లె కన్నీరు పెడుతుందో కని పించని కుట్రల' అనే పాటలను కేటీఆర్ ప్రస్తా వించారు. 'ఆనాడు పాలకుల కర్కషత్వం, నిరంకుశత్వంపై 'దుక్కులు దున్నిన రైతు చేతుల బేడీలెందుకురోరన్న.. మొక్కలు నాటిన కూలీలనెందుకు జైల్లో పెట్టిండ్రోరన్న' అని గద్దరన్న పాడిండు. ఇప్పుడు తెలంగా ణలో జరుగుతున్న పరిణామాలను చూస్తుం టే గద్దరన్న మన మధ్య ఉండుంటే మళ్లీ గజ్జె గట్టి ఈ కాంగ్రెస్ సర్కారుపై ఇదే పాట అందు కొని గర్జించేవాడు' అని గుర్తుచేశారు. రైత న్నకు ఎంత ఇచ్చినా ఏమిచ్చిన తక్కువేననే భావనతో 'పొలాలనన్నీ, హలాలదున్నీ, ఇలా తలంలో హేమం పిండగ - జగానికంతా సౌఖ్యం నిండగ - విరామ మెరుగక పరిశ్ర మించే, బలం ధరిత్రికి బలి కావించే,కర్షక వీరుల కాయం నిండా' అన్న శ్రీశ్రీ కవితను కేటీఆర్ ప్రస్తావించారు.

జూపల్లికి గట్టి కౌంటర్

పాలమూరులో ప్రాజెక్ట్‌లను పూర్తిచేయకుండా వదిలిపెట్టిందే కాంగ్రెస్ అని కేటీఆర్ విమర్శనాస్త్రాలు సంధించారు. పాలమూరు వలసలు ఆపింది, సాగును పెంచింది బీఆర్ ఎస్ ప్రభుత్వమని స్పష్టంచేశారు. ఆ సమయంలో మంత్రి జూపల్లి కృష్ణారావు కల్పించు కున్నారు. పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులకు మరో 50 వేల కోట్లు కావాలని, పూర్తి ఆయకట్టుకు నీళ్లు రాలేదని చెప్పారు. మెజార్టీ గ్రామాలకు మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదన్నారు. దీనిపై కేటీఆర్ స్పందిస్తూ 'పాలమూరు జిల్లాలో పెండింగ్ కేఎల్ఐ, భీమా, నెట్టెంపాడులను 4 వేల కోట్లతో పూర్తిచేసి, ఆరున్నర లక్షల ఎకరాలకు నీళ్లిచ్చిన మాట వాస్తవం కాదా? మీ గుండెమీద చెయ్యి వేసుకొని చెప్పాలి' అని మంత్రి జూపల్లికి సవాల్ విసిరారు. 'మేము తొమ్మిదిన్నరేండ్లు ఉచితంగా సాగు, తాగు నీళ్లిచ్చినం. నీటి తీరువా రద్దుచేసినం.. భూమిశిస్తు రద్దుచేసినం. బకాయిలు మాఫీ చేసినం. భవిష్యత్తులోనూ ఇలాగే రైతన్నలకు ఉచితంగా ఇస్తం.. నిజాయితీగా చెప్తున్నం.. రైతుల మీద ఎలాంటి భారం మోపబోం' అని గట్టిగా కౌంటరిచ్చారు.

హాస్టళ్లలో అమలు కాని కొత్త మెనూ!

సూర్యాపేట, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు కొత్త మెనూను అట్టహాసంగా ప్రకటించిన కాంగ్రెస్ సర్కారు.. సరిపోను నిధులు మాత్రం ఇవ్వడం లేదు. దీంతో కొత్త మెనూ ఎక్కడా అమలుకు నోచడంలేదు. మరో వైపు విద్యార్థులకు అందించే ఆహార పరి మాణాన్ని తగ్గించడం విమర్శల పాలు చేస్తున్నది. వాస్తవానికి కొత్త మెనూ అమలు కావాలంటే మార్కెట్ ధరలకు అనుగునంగా రోజుకు ఒక్కో విద్యార్థికి రూ.100 ఇవ్వడంతోపాటు హాస్టళ్లలో మౌలిక వసతులు, సిబ్బందిని సమకూ ర్చాల్సి ఉన్నది. ఈ మేరకు రాష్ట్రవ్యా ప్తంగా ఆయా జిల్లాల కలెక్టర్లకు వార్డెన్లు వినతిపత్రాలను అందిస్తూ తమకు ఎదు రవుతున్న సమస్యలను విన్నవిస్తు న్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సంక్షేమ హాస్టళ్ల విద్యార్థు లకు పౌష్టికాహారం అందించేందుకు 2015లో అప్పటి సీఎం మెస్ చార్జీలను 45 నుంచి 50 శాతానికి అదనంగా పెంచారు. పాఠశాలల్లో సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం పథకాన్ని కూడా ప్రారంభించారు. ఇప్పటివరకు అదే అమలు అవుతున్నది. కాంగ్రెస్ ప్రభు త్వం అధికారంలోకి వచ్చాక హాస్టళ్లలో తరుచూ ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

రోజుకు రూ.100 ఇస్తేనే సాధ్యం

కొత్త మెనూ అమలుకు ప్రతి విద్యా ర్థికి రోజుకు రూ.100 చొప్పున ఇస్తేనే సాధ్యమవుతుందని వార్డెన్లు చెప్తు న్నారు. 2015కు ముందు ప్రీ మెట్రిక్ హాస్టల్ విద్యార్థులు, 8 నుంచి 10వ తర గతి విద్యార్థులకు రూ.450 నుంచి 500 ఉండగా, కాలేజీ విద్యార్థులకు రూ.800 వరకు ఉండేది. ఆనాటి సీఎం కేసీఆర్ ప్రీమెట్రిక్ విద్యార్థులకు రూ.950, 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ.1,100 చొప్పున పెంచారు. కళాశాలల విద్యార్థులకు రూ.1,500 చొప్పున ఇచ్చారు. దాంతో రోజూ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం సన్నబియ్యంతో భోజనం, పప్పు, సాంబారు ఇస్తుండగా రాత్రి సమ యంలో కూడా సన్న బియ్యంతో అన్నం, ఓ కూర, మజ్జిగతోపాటు వారంలో ఐదు రోజులు గుడ్డు, రెండు సార్లు నాన్‌వెజ్ అమలు చేస్తూ వచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 35 నుంచి 40 శాతం మెస్‌చా ర్జీలు పెంచినా విద్యార్థులకు అందించే మెనూ మాత్రం ఐదారింతలు ఉండ టంతో అమలు చేయలేని పరిస్థితి నెల కొన్నది.

మా హామీలన్నీ అమలు కాకపోవడం నిజమే!

మొదటిపేజీ తరువాయి...

ఆరోపించారు. తద్వారా ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రతిపక్షం మీదికి నెట్టేసే ప్రయత్నం చేశారు. రాష్ట్రంలో పరిపాలన గాడి తప్పిందని, జరగాల్సిన రీతిలో పనులు జర గడం లేదని ప్రజలు, మేధావులు అభిప్రాయ పడుతుండటం కొన్ని మీడియా సంస్థలు చేసిన సర్వేల్లో కూ